సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం, 28, సెప్టెంబర్, 2024



ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రముఖ పర్యాటక కేంద్రం పద్మాపురం బొటానికల్ గార్డెన్‌లో పూలతో చేపట్టిన అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ సిబ్బంది ఏర్పాటు చేసిన అక్షర నమూనా సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది.

–అరకు రూరల్

న్యూస్‌రీల్

నేడు, రేపు పర్యాటకులను అనుమతించం

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: తుపాను కారణంగా పర్యాటక ప్రాంతాల్లో జలపాతాల వద్దకు పర్యాటకులను అనుమతించమని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీలు తెలిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు అనుమతి లేదన్నారు. భారీ వర్షాలకు కొండవాగులు పొంగే అవకాశం ఉన్నందున మారుమూల ప్రాంతాల గిరిజనులు కొండ వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని వారు సూచించారు.

ఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



సాక్షి,పాడేరు: తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్స్ ఎస్ఈగా జీఎన్ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఆయన విశాఖలోని అసెస్మెంట్స్ ఎస్ఈగా పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు దిగువ స్థాయి సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం వారితో సమావేశం నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలని ఏఎన్ఎంల వినతి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న ఏఎన్ఎంలు

పాడేరు : వైద్యారోగ్యశాఖలో జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న తమ సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఎన్ఎంల యూనియన్ ప్రతినిధులు పుష్ప, రమాప్రభ, భాగ్యవతి కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం స్థానిక ఐటీడీఏ వద్ద జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుంచి నేటి వరకు ఆర్‌సీహెచ్ ట్రాకింగ్ నగదు, 2021 నుంచి నేటి వరకు ఏవీడీ నగదు, 2020 నుంచి ఇప్పటివరకు ఎఫ్‌టీఏ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఆర్‌లు అప్‌డేట్ చేయడంలో, ఇంక్రిమెంట్లు మార్పే విషయంలో సీనియర్ అసిస్టెంట్లు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. యూనియన్ ప్రతినిధులు భవాని, విజయ, కొండమ్మ, చంద్ర, పూర్ణ పాల్గొన్నారు.

అతిథి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రంపచోడవరం: రంపచోడవరం, చింతూరు పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి అతిథి ఉపాధ్యాయుల నియామకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని పీవో కట్టా సింహాచలం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంగ్లీషు మీడియంలో సీబీఎస్ఈ సిలబస్ బోధించాలని పేర్కొన్నారు. అసక్తి కలిగిన రిటైర్డ్ టీచర్లు, ఆయా సబ్జెక్టులో విద్యార్హతలు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తెలుగు –3, హిందీ–1, బయాలజీ–3, ఫిజిక్స్ –2 ఖాళీ ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తులను వచ్చే నెల ఐదవ తేదీలోగా రంపచోడవరంలోని గురుకులం సెల్‌లో అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలకు గురుకులం సెల్, ఏకలవ్య మోడల్ స్కూళ్లను సంప్రదించాలని పీవో కోరారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లయ్య

ఎటపాక: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య తెలిపారు. శుక్రవారం నెల్లిపాక పీహెచ్‌సీ పరిధి చంద్రంపాలెంలో ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఇంటింటి సర్వే నిర్వహించి మురుగు నిల్వలను పరిశీలించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి అవగాహన కల్పించారు. అనంతరం ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



పాడేరులో వైద్య కళాశాల తరగతులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్న భవనం

- జగన్ కల సాకారం

వైద్య విద్యకు శ్రీకారం

- పాడేరు కళాశాలలో వచ్చే 14 నుంచి తరగతులు
- కొత్త భవనాల్లోనే నిర్వహణ
- జిల్లా ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు
- ఈ నెలాఖరుకల్లా పూర్తికానున్న ప్రవేశాల ప్రక్రియ
- 75 శాతం ఫ్యాకల్టీని సిద్ధం చేసిన గత ప్రభుత్వం

ఏజెన్సీ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు, యువతకు వైద్య విద్య అందుబాటులోకి తేవాలన్న గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలల సాకారానికి ముహూర్తం ఖరారైంది. జిల్లా కేంద్రం పాడేరులో ఆయన హయాంలో మంజూరు చేసిన వైద్య కళాశాల వచ్చే నెల 14న ప్రారంభం కానుంది. సరైన వైద్య సదుపాయాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్న తరుణంలో జిల్లా ప్రజలకు ఇది కచ్చితంగా ఒక వరం. ఈ తరుణంలో అన్నివర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.



పాడేరులో సూపర్ స్పెషాలిటీ సేవలు అందించనున్న జిల్లా సర్వజన ఆస్పత్రి



అడ్మిషన్ పొందుతున్న ఎస్టీ విద్యార్థిని జాలారి దీప్తి

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన వైద్య కళాశాల వచ్చేనెల 14న ప్రారంభం కానుంది. పాడేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని 35 ఎకరాల విస్తీర్ణంలో రూ.500కోట్లతో నిర్మిస్తున్న భవన నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదు. అయినప్పటికీ వైద్య కళాశాల నిర్వహించే బ్లాక్‌ను మాత్రం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసే పనుల్లో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఈ భవనంలో సంబంధిత బ్లాక్‌ను పూర్తిచేసి అక్కడే తరగతులు నిర్వహించేందుకు జాతీయ మెడికల్ కౌన్సిల్ అనుమతి ఇచ్చింది.

38 మంది చేరిక

పాడేరు మెడికల్ కళాశాల 50 సీట్లతో ప్రారంభించేందుకు జాతీయ మెడికల్ కౌన్సిల్ గత నెలలో అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు 38 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. మిగిలిన 12 సీట్లు ఈనెలాఖరుకు భర్తీ కానున్నాయి. దీంతో ప్రవేశాల ప్రక్రియ కొలిక్కి రానున్న నేపథ్యంలో వచ్చేనెల 14 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

కొత్త భవనాలు పూర్తయ్యేవరకు..

పాలిటెక్నిక్ సమీపంలో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆస్పతి భవన నిర్మాణానికి మరో ఏడాది పట్టే అవకాశం ఉంది. అప్పటివరకు జిల్లా సర్వజన ఆస్పత్రిలోనే రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

➡ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈఏడాది జనవరిలో సుమారు రూ.2కోట్లతో జిల్లా సర్వజన ఆస్పత్రిని కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసింది. వైద్య కళాశాలను దృష్టిలో పెట్టుకుని 420 పడకలు అందుబాటులోకి వచ్చాయి. దీనిని పరిశీలించిన జాతీయ మెడికల్ కౌన్సిల్ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. వైద్య కళాశాలకు అనుబంధంగా సేవలందించడం వల్ల గిరిజనులకు ఉన్నత వైద్యం అందనుంది.

➡ వైద్య కళాశాల ఫ్యాకల్టీ నియామకం గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది. 75 శాతం మేర అందుబాటులోకి తెచ్చింది. బోధనకు సంబంధించి అన్నింటిని సమకూర్చింది.

రోగులకు ఉన్నత వైద్యసేవలు కల్పిస్తాం



వచ్చే నెల14న వైద్య కళాశాల ప్రారంభం కానున్న నేపథ్యంలో నెలాఖరు కల్లా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. తరగతులను కొత్త భవనంలోనే నిర్వహిస్తాం. ఇందుకు సంబంధించి కొన్ని గదులను సిద్ధం చేస్తున్నాం. ప్రొఫెసర్లతో పాటు అన్ని విభాగాల వైద్యనిపుణులు, ఫ్యాకల్టీ 75శాతం మేర అందుబాటులో ఉంది. వైద్య కళాశాల ఆవరణలో సూపర్ స్పెషాలిటి ఆస్పత్రి బ్లాక్ పూర్తయ్యేవరకు జిల్లా ఆస్పత్రిలోని 420 బెడ్‌ల ద్వారా రోగులకు ఉన్నత వైద్యసేవలు కల్పిస్తాం.

– డాక్టర్ డి.హేమలతాదేవి, ప్రిన్సిపాల్, వైద్యకళాశాల, పాడేరు

చంద్రబాబు పాపం ప్రక్షాళనకు నేడు పూజలు

సాక్షి,పాడేరు: టీటీడీ దేవస్థానం లడ్డూ ప్రసాదం విషయంలో కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు పాడేరులోని మోదకొండమ్మతల్లికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని పాడేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉదయం 7గంటల నుంచి పాడేరు మోదమ్మ ఆలయంలో పూజలు జరుగుతాయని వారు పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు,అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పార్టీ శ్రేణులు పాల్గొంటారని తెలిపారు.

అరకులోయ టౌన్: చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు శనివారం ఉదయం 8 గంటలకు అరకు పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూజలు అనంతరం కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు. అరకు, డుంబ్రిగుడ మండలాలకు చెందిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీలో వివిధ పదవుల్లో ఉన్నవారు, కార్యకర్తలు, నాయకులు ఆలయం వద్ద రావాలని ఆయన కోరారు. అనంతగిరి, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు ఆయా మండల కేంద్రాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.

బదిలీల ‘పంచాయితీ’

- పంచాయతీరాజ్ శాఖ బదిలీల్లో అక్రమాలు
- కీలక మండలాల్లో పోస్టుకు రూ.10 లక్షలు
- అనకాపల్లిలో కాసుల కుమ్మరింపు.. ఎడాపెడా పోస్టింగ్‌లు
- ఏజెన్సీ విషయంలో నిబంధనలు పాటించని అధికారులు
- డీపీవోపై ఉమ్మడి జిల్లాల నోడల్ అధికారికి ఫిర్యాదు

సాక్షి,అనకాపల్లి/మహారాణిపేట: పంచాయతీరాజ్‌లో అడ్డగోలు బదిలీల పంచాయతీ అగ్గి రాజేస్తోంది. కార్యనిర్వాహక అధికారుల బదిలీ ప్రక్రియపై ఆరోపణలు భగ్గుమంటున్నాయి. ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల పేరుతో ఇష్టానుసారంగా పోస్టింగ్‌లు ఇచ్చేశారు. వారి నుంచి భారీగా ముడుపులు తీసుకొని కావాల్సిన పోస్టింగ్‌లు ఇచ్చారన్న టాక్ నడుస్తోంది. ఈ విషయంలో నిబంధనలకు సైతం తిలోదకాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి, 50 ఏళ్లు దాటిన వారికి అల్లూరి జిల్లా నుంచి మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలి. కానీ అలా చేయకపోవడం ఇపుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ బదిలీల్లో కొంత మంది పంచాయతీ అధికారులు చేతివాటం ప్రదర్శించడంతో ఏజెన్సీలో పనిచేస్తున్న ఈవోపీఆర్‌డీవోలు అక్కడే ఉండిపోయారు. ఒక్కో పోస్టుకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు తీసుకున్నారన్న ప్రచారం సాగుతోంది. అనకాపల్లి జిల్లాలో జరుగుతున్న ఈ బదిలీల ప్రక్రియపై ఉమ్మడి విశాఖ జిల్లా నోడల్ అధికారి అయిన విశాఖ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి.

ఖాళీలు లేవట

మైదాన ప్రాంతాల్లో ఈవోపీఆర్ అండ్ ఆర్‌డీ పోస్టులు ఖాళీలు లేవని, అందుకే ఏజెన్సీలో పనిచేస్తున్న వారిని మైదాన ప్రాంతాలకు బదిలీ చేయలేదని పంచాయతీ అధికారులు బహిరంగంగా చెబుతున్నారు. సర్వీసులో ఇంతవరకు ఏజెన్సీలో పనిచేయని ఈవోఆర్‌డీవోలు ఎంతోమంది ఉన్నారు. వారిని నిబంధనల ప్రకారం ఏజెన్సీలో నియమించాల్సి ఉంది. కానీ వారి జోలికి అధికారులు వెళ్లకపోవడం ఆరోపణలకు తావిస్తోంది.

బదిలీలు జరిగిన వారం రోజులకు ఫిర్యాదు

ఈనెల 22న ఈవోపీఆర్ అండ్ ఆర్‌డీ బదిలీలు జరిగాయి. ఈ బదిలీలు జరిగిన వారం రోజులకు ఫిర్యాదు చేయడమేంటి? వారికి అభ్యంతరాలు ఉంటే బదిలీలు జరిగిన తర్వాత రోజే ఫిర్యాదు చేయాలి. అయినా అనకాపల్లి జిల్లాలో ఎటువంటి రిక్వైర్‌మెంట్ లేదు. అన్ని మండలాల్లో ఈవోలు ఉన్నారు. ఎక్కడా ఖాళీలు లేవు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలోనే బదిలీల ప్రక్రియ పూర్తి చేశాం. బదిలీలన్నీ పారదర్శకంగా జరిగాయి.

– శిరీషరాణి, జిల్లా పంచాయతీ అధికారి, అనకాపల్లి జిల్లా

మిరియం సాగుకు మరింత ప్రోత్సాహం అవసరం

- ఢిల్లీ సదస్సులో కోరిన కలెక్టర్ దినేష్‌కుమార్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి,పాడేరు: గిరిజనులకు ఆర్థిక చేయూత అందించే మిరియం సాగుకు మరింత ప్రోత్సాహం అందించాలని కోరినట్టు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం న్యూఢిల్లీలో స్పైసెస్ బోర్డు, ఐక్య రాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థలు నిర్వహించిన వర్క్‌షాప్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో గిరిజనులు సేంద్రియ పద్ధతిలో కాఫీలో అంతరపంటగా చేపట్టిన మిరియం సాగుపై మాట్లాడారు. సాగు విస్తీర్ణం పెంపు, గిట్టుబాటు ధర కల్పన, మార్కెటింగ్‌కు సంబంధించి స్పైసెస్ బోర్డు ద్వారా ఎండ్ టూ ఎండ్ సంస్థ మద్దతు అందించాల్సిన అవసరం ఉందని కోరినట్టు ఆయన పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలో ప్రాంతీయ కార్యాలయం కూడా ఏర్పాటుచేయాలని సమావేశంలో కోరినట్టు ఆయన వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో ఆయనతోపాటు స్పైసెస్‌బోర్డు సీనియర్ క్షేత్రాధికారి బి.కళ్యాణి, రైతులు డిప్పల దేవి, కె.రాజారత్నం, జి.ఆనంద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఉద్యోగుల వినతి



విశ్వేశ్వరరాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు

పాడేరు : స్థానిక ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు , వారి కుటుంబ సభ్యులు తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరాజుకు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం వారు ఆయనను కలిశారు. ఆర్టీసీ క్వార్టర్స్‌లో సుమారు 18 మంది ఉద్యోగుల కుటుంబాలు నివాసం ఉంటున్నట్టు తెలిపారు. ఒకొక్కరికి నెలవారీ హెచ్‌ఆర్‌ఏ ఏకంగా రూ.7 వేల నుంచి రూ.12వేల వరకు కట్ అవుతోందన్నారు. దీనివల్ల భారీగా నష్టపోతున్నామని వాపోయారు. క్వార్టర్స్‌లో సరైన వసతులతోపాటు అక్కడికి వెళ్లేందుకు పూర్తి స్థాయిలో రహదారి సౌకర్యం కూడా లేదన్నారు. జీతం బేసిక్ ప్రాతిపదికన హెచ్‌ఆర్‌ఏ కట్ చేయాలని ఆర్టీసీ ఉద్యోగులు కోరారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కరిస్తామని ఆర్టీసీ ఉన్నతాధికారులు ఆయనకు హామీ ఇచ్చారు. ఆర్టీసీ ఉద్యోగులు టి.రామారావు, పూర్ణమ్మ, జేఎస్ చలం, బాలరాజు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్, పీడీలను సస్పెండ్ చేయాలి

- లేకుంటే ఆందోళన చేస్తాం
- ఆదివాసీ గిరిజన సంఘం ప్రతినిధులు మట్ట వాణిశ్రీ, సిరిమల్లిరెడ్డి హెచ్చరిక
- ఏపీ గురుకుల కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్టు వెల్లడి



గురుకులం సెక్రటరీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న మట్ట వాణిశ్రీ తదితరులు

రంపచోడవరం: స్థానిక ఏపీఆర్ బాలికల కళాశాల విద్యార్థినుల పట్ల నిరంకుశంగా ప్రవర్తించిన ప్రిన్సిపాల్ బి. ప్రసూన, పీడీలను తక్షణమే సస్పెండ్ చేయకుంటే ఆందోళన చేస్తామని ఆదివాసీ గిరిజన సంఘం ప్రతినిధులు మట్ట వాణిశ్రీ, సిరిమల్లిరెడ్డి హెచ్చరించారు. దీనిపై శుక్రవారం అమరావతిలో ఏపీ గురుకులం డిప్యూటీ సెక్రటరీని కలిసి ఫిర్యాదు చేశామన్నారు. ప్రిన్సిపాల్ బాధ్యతారహితంగా వ్యవహరించి విద్యార్థినుల ప్రాణాలతో చెలగాటమాడారని, ఆమెపై తక్షణ చర్యలు తీసుకోవాల్సిన ఐటీడీఏ అధికారులు ప్రిన్సిపాల్‌కు మద్దతు తెలిపి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విదార్థినులను తిట్టారని ఆరోపించారు. గిరిజనులు హక్కుల రక్షణ కృషి చేయాల్సిన అధికారుల వేధింపులకు గురి చేస్తున్న వారికి కొమ్ము కాస్తుంటే విద్యార్థినులు తమ బాధను ఎవరికి చెప్పాలని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకోకుంటే విద్యార్థినుల తల్లిదండ్రులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ప్రకృతి రమణీయత ఎంతో అద్భుతం



అరకులో ప్రదర్శనలను తిలకిస్తున్న పర్యాటకులు, స్థానికులు



అరకులో విద్యార్థినుల థింసా నృత్య ప్రదర్శన

- పచ్చదనం, మంచు అందాలతో మంచి అనుభూతి
- పాడేరు సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్
- కలెక్టరేట్‌లో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం



అరకులో ర్యాలీ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



అరకు-లంబసింగి పర్యాటక లోగోను ఆవిష్కరిస్తున్న పాడేరు సబ్‌కలెక్టర్, డీఆర్వో



పాడేరులో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

సాక్షి,పాడేరు: జిల్లాలో ప్రకృతి రమణీయత ఎంతో అద్భుతమని పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేట్ అన్నారు. కలెక్టరేట్‌లో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన సంస్కృతీ సంప్రదాయాలతో పాటు ఆహ్లాదకర వాతావరణం గిరిజన ప్రాంతాల సొంతమన్నారు. తాను ముస్సోరిలోని ఐఏఎస్ అకాడమిలో శిక్షణ పొందానని, అక్కడి కంటే ఇక్కడ ప్రకృతి అందాలు మైమరిపిస్తున్నాయన్నారు. ఎటు చూసినా పచ్చదనం, మంచు అందాలు మంచి అనుభూతి కలిగిస్తున్నాయన్నారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. పర్యాటక రంగం అభివృద్ధితో గిరిజన ప్రాంతాల్లో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. అనంతరం లంబసింగి–అరకు పర్యాటకానికి సంబంధించిన 2.0 ప్రాజెక్ట్ లోగోను ఆయన, డీఆర్‌వో పద్మావతి ఆవిష్కరించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

పలు గిరిజన విద్యాలయాలు, కేజీబీవీ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకాలు, సాంస్కృతిక ప్రదర్శనలు,థింసా నృత్యాలు అలరించాయి. లోగోను రూపొందించిన పర్యాటకశాఖ కోఆర్డినేటర్ రతన్‌రాజును సబ్‌కలెక్టర్ అభినందించారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. డీఈవో బ్రహ్మాజీ రావు, తహసీల్దార్ వి.త్రినాథరావునాయుడు, ఎంపీటీసీ గిడ్డి విజయలక్ష్మి,అనంతగిరి సర్పంచ్ రమణమ్మ,పర్యాటక అభివృద్ధి సంస్థ సభ్యుడు కిల్లు రమేష్‌నాయుడు, జిల్లా వ్యవసాయ,ఉద్యానవనశాఖ అధికారులు ఎస్‌బీఎస్. నందు, రమే ష్‌కుమార్‌రావు, జిల్లా పట్టుపరిశ్రమ అధికారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో శుక్రవారం ఏపీటూరిజం, గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్ మేనేజర్లు, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్ఎస్ బృందం ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా ర్యాలీ నిర్వహణ అనంతరం గిరిజన మ్యూజియం ప్రాంగణంలోని మత్రికామయ్య సాంస్కృతిక కళావేదిక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. థింసా నృత్యాలతో అలరించారు. పద్మాపురం గార్డెన్‌లో బంతి పువ్వులతో అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, టూరిజం జిల్లా మేనేజర్ మురళి, గిరిజన మ్యూజియం మేనేజర్ మణికుమార్, అసిస్టెంట్ మేనేజర్ సారథి, యూనిట్ మేనేజర్ సుమాన్, చాపరాయి ఇన్‌చార్జి అప్పారావు, టూరిజం ఇన్‌చార్జి గణపతి, పద్మాపురం మేనేజర్ బొంజిబాబు, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

పర్యాటకరంగ అభివృద్ధికి చర్యలు



ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయ రూరల్: పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన స్థానిక గిరిజన మ్యూజియంను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సందర్శనీయ ప్రాంతాల్లో సౌకర్యాల కల్పనపై ప్రత్యేకదృష్టి సారించామని చెప్పారు. పర్యాటకులను ఆకర్షించేలా గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనం, డుంబ్రిగుడ చాపరాయి జలవిహారిని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. అరకులోయ టూరిజం మేనేజర్ మురళి, మ్యూజియం మేనేజర్ మణికుమార్, పద్మాపురం మేనేజర్ బొజ్జిబాబు, ఇన్‌చార్జి మేనేజర్ శారద, యూనిట్ ఇన్‌చార్జి సుమన్, టూరిజం ఇన్‌చార్జి గణపతి పాల్గొన్నారు.

విధుల్లో కొనసాగించాలని వలంటీర్ల ర్యాలీ



జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు

కూనవరం: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ/వార్డు సచివాలయ వలంటీర్లు శుక్రవారం కోతులగుట్టలో ర్యాలీ నిర్వహించారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ గౌరవాధ్యక్షుడు కొమరం పెంటయ్య మాట్లాడుతూ వలంటీర్ల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలన్నారు. రాజీనామా చేసిన వలంటీర్లను తిరిగి కొనసాగించాలని, పెంచిన రూ.10 వేలు వేతనాలను ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యదర్శి చిచ్చడి మహేష్, అధ్యక్షుడు సోందె పద్మ, మడకం రవి పాల్గొన్నారు.

పట్టుతప్పితే.. ప్రాణం పోయినట్టే

- నవజాత శిశువుతో బాలింతను వాగు దాటించిన వైనం
- అడ్డతీగల మండలం ఏలేరు వాగు వద్ద ఘటన



ఏలేరు వాగుకు అడ్డుగా నిర్మించిన వియర్ (అడ్డుగోడ)పై నడిచి వెళ్తున్న గిరిజనులు





ఒకరు శిశువుని పట్టుకుని నీటి ప్రవాహంలో ముందుకు కదలగా.. మరొకరు బాలింతను భుజానకెత్తుకుని వెళ్తున్న దృశ్యం

అడ్డతీగల: రోగమొచ్చినా రొప్పొచ్చినా పింజరికొండ గ్రామస్తుల కష్టాలు వర్ణనాతీతం.. అత్యవసరమైతే వానొచ్చినా వరదొచ్చినా ప్రమాదకరమైన ఏలేరు వాగు దాటుకుని బాహ్య ప్రపంచంలోకి రావాల్సిందే. తాజాగా గ్రామానికి చెందిన గర్భిణి వెలుగుల మేరీ జ్యోతి ప్రసవానికి ముందే నరకయాతన అనుభవించింది. ప్రసవానికి ముందు తర్వాత ప్రమాదపుటంచున ప్రయాణం చేసి ఇంటికి క్షేమంగా చేరుకోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఆమెకు మూడు రోజుల క్రితం పురిటి నొప్పులు అధికం కావడంతో అధిక వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్న ఏలేరు వాగు దాటుకుని ఎల్లవరం పీహెచ్‌సీకి బంధువులతో చేరుకుంది. ఈ నేపథ్యంలో పవర్ ప్రాజెక్ట్ నీటి మళ్లింపు కోసం వాగుకు అడ్డంగా నిర్మించిన వియర్(అడ్డుగోడ)పై నుంచి నీరు ప్రవహిస్తున్నప్పటికీ అడుగులో అడుగు వేసుకుని ధైర్యం కూడదీసుకుని ప్రమాదం అయినప్పటికీ వెళ్తున్నారు. ఏ మాత్రం నీటి ప్రవాహం వల్ల గాని లేదా నాచుపట్టిన సిమెంట్ గోడపై కాలుజారినా 20 అడుగులు లోతైన నీటిలోకి జారిపడిపోతారు. ఈ క్రమంలో బంధువులు, గ్రామస్తులు సహాయంతో మేరీ జ్యోతి వాగు దాటుకుని ఆస్పత్రికి చేరుకుంది. అక్కడ ప్రసవించిన తర్వాత గురువారం సాయంత్రం డిశ్చార్జి అయ్యి తిరిగి గ్రామానికి బయలుదేరింది. ఇంతలో ఎడతెరిపిలేని వర్షాల కారణంగా అడ్డుగోడపై నుంచి నీరు అధికంగా వెళ్తోంది. దీంతో ఆమె బంధువుల్లో ఒకరు శిశువును రెండు చేతులతో ఒడిసి పట్టుకుని ముందుకు కదలగా, మరొకరు బాలింత మేరీ జ్యోతిని భుజానకెత్తుకుని అడుగులో అడుగు వేస్తూ నీరు నెట్టుతున్నప్పటికీ వెరవకుండా సుమారు 70 మీటర్లు నడుచుకుంటూ వెళ్లి గ్రామానికి చేరుకున్నారు. వర్షాకాలం వచ్చిందంటే కొండ వాగుల ఉధృతి గిరిజనులకు ఎన్ని కష్టాలను తెచ్చిపెడుతున్నాయి అనడానికి ఈ సంఘటన నిదర్శనంగా నిలుస్తోంది. గర్భిణిగా అదే వాగులో దాటుకుని వెళ్లింది. ప్రసవించిన తర్వాత శిశువుతో సహా బాలింతగా ఉన్నా అదే వాగు దాటుకుని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇంటికి చేరుకోవాల్సిన దుస్థితి ఎదురైంది.

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు అభినందనలు వెల్లువ



ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు అభినందనలు తెలుపుతున్న మోదకొండమ్మతల్లి ఆలయ కమిటీ ప్రతినిధులు



ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా, మండల నాయకులు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయానికి జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మోదకొండమ్మతల్లి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, సభ్యులు బోనంగి వెంకటరమణ, డి.పి.రాంబాబు, గూడెపు ప్రకాశరావు, కిల్లు శ్రావణ్‌కుమార్, తమురవ కుమార్, తదితరులు పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరాజుకు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, పార్టీ పాడేరు మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, కించూరు సర్పంచ్ వంతాల రాంబాబుతో పాటు పాడేరు, జి.మాడుగుల మండలాల నాయకులు, కార్యకర్తలు కూడా ఎమ్మెల్యేను కలిసి పూలమాలలతో అభినందనలు తెలిపారు. జిల్లా పార్టీ అభివృద్ధికి కీలకమైన అధ్యక్ష పదవికి పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును ఎంపిక చేసిన పార్టీ జాతీయ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి నేతలంతా ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు

వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలిగా, పీఏసీ సభ్యురాలిగా తనను నియమించిన పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలు విజయవంతంగా నిర్వహించడంతో పాటు వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఫేక్ ఇన్‌స్టా ఖాతాలో యువతి ఫొటోలు పెట్టి వేధింపులు

- గుంటూరులో నిందితుడి అరెస్ట్

విశాఖ సిటీ: ఫేక్ ఇన్‌స్టా గ్రామ్ ఖాతాలో యువతి ఫొటోలు పెట్టి వేధిస్తున్న యువకుడిని విశాఖ సైబర్ క్రైం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. గుంటూరు నుంచి విశాఖకు తీసుకువచ్చి రిమాండ్‌కు పంపించారు. వివరాలివీ... నగరానికి చెందిన ఒక యువతి ఇన్‌స్టా గ్రామ్‌కు గుర్తు తెలియని ఇన్‌స్టా ఖాతా నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. దానికి ఆమె అంగీకరించి కొద్ది రోజుల చాటింగ్ తర్వాత పరిచయం పెరిగింది. యువతి నంబర్ తీసుకున్న యువకుడు తరచూ మాట్లాడుకున్నారు. తర్వాత బయట కలిసి ఫొటోలు తీసుకున్నారు. అనంతరం ఆ యువకుడు నకిలీ ఇన్‌స్టా గ్రామ్ అకౌంట్ క్రియేట్ చేసి ఇద్దరూ కలిసి తీసుకున్న ఫొటోలను అందరికీ పంపించాడు. ఈ విషయం తెలుసుకున్న యువతి వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి సాంకేతికత సహాయంతో విజయనగరానికి చెందిన చింతగుంటి చిన్నారావుగా గుర్తించారు. గుంటూరులో అతన్ని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపించారు.

రూ.43 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

- గంజాయి రవాణా, సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవు
- పాడేరు ఏఎస్పీ ధీరజ్ హెచ్చరిక



పట్టుకున్న గంజాయి, నిందితుడితో పాడేరు ఏఎస్పీ ధీరజ్, సీఐ వెంకట్రావు, ఎస్‌ఐ రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఏఎస్పీ ధీరజ్

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ అసరాడ సమీపంలో గురువారం ముంచంగిపుట్టు పోలీసులు సుమారు రూ.43 లక్షల విలువ చేసే గంజాయిని పట్టుకున్నారు. గంజాయితో పాటు రవాణాకు ఉపయోగించిన వ్యాన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను పాడేరు ఏఎస్పీ కె.ధీరజ్ వివరించారు. స్థానిక ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు మండలంలోని వనుగుమ్మ పంచాయతీ అసరాడ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఆ సమయంలో జోలాపుట్టు వైపు వెళ్లేందుకు ఇటుగా వస్తున్న ఒక ద్విచక్రవాహనం, దాని వెనక వస్తున్న వ్యాన్‌ను ఆపేందుకు ప్రయత్నించారు. వ్యాన్‌లో ఉన్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయారు. ద్విచక్రవాహనంతో పైలెట్‌గా వస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. వ్యాన్‌ను తనిఖీ చేయగా 43 బస్తాల్లో గల గంజాయి బయటపడింది. గంజాయి, వ్యాన్,బైక్,పైలెట్‌గా వస్తున్న వ్యక్తిని ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న గంజాయి 860 కిలోలు ఉందని,దీని విలువ రూ.43లక్షలు ఉంటుందని ఏఎస్పీ ధీరజ్ తెలిపారు.పైలెట్‌గా వచ్చిన వ్యక్తి మండలంలో గల మాకవరం పంచాయతీ కుంబిరిపడ గ్రామానికి చెందిన చెండా ఆనందరావుగా గుర్తించామని, నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నామని ఆయన చెప్పారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు వ్యక్తుల వివరాలను, గంజాయి విక్రయించిన వారి వివరాలను సేకరిస్తున్నామని, త్వరలోనే అందరినీ అరెస్టు చేస్తామన్నారు. గంజాయి రవాణా,సాగు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జి.మాడుగుల సీఐ సీహెచ్.వెంకటరావు,ఏఎస్ఐ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్సైలు బాధ్యతల స్వీకరణ



రమేష్



భూషణం



శివన్నారాయణ

గంగవరం/మోతుగూడెం/చింతూరు: నూతన ఎస్సైలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వీఆర్‌లో ఉన్న పి. రమేష్ చింతూరు ఎస్సైగా నియమితులు కాగా, బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్సైగా పని చేసిన శ్రీనివాసరావు అనంతగిరికి బదిలీ అయ్యారు. మోతుగూడెం పోలీస్ స్టేషన్‌లో ఏడాదిగా పనిచేసిన గోపాలరావు బదిలీపై అరకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించిన ఎస్సై శివన్నారాయణ మాట్లాడుతూ గంజాయి రవాణా అరికట్టేందుకు కృషి చేస్తానని, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా గట్టి చర్యలు తీసుకుంటానని తెలిపారు. గంగవరం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన డి. భూషణం మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

రంపచోడవరం డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ కొండలరావు

మారేడుమిల్లి: విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలని రంపచోడవరం డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు తెలిపారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. తరగతి గదులలో అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నారా.. లేదని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాల పరిసరాలు, వంటశాలలను పరిశీలించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు లెక్కలు నేర్పించి వాటిపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులంతా అంకితభావంతో పనిచేసి విద్యా ప్రమాణాలు పెంపొందించాలన్నారు. అనారోగ్యంతో బాధపడితే తక్షణమే వైద్య సేవలు అందించాలన్నారు. పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం ఎం.రామారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని డాక్‌యార్డు ఉద్యోగి మృతి



దిలీప్ కుమార్ మృతదేహం, (ఇన్‌సెట్) ఫైల్ ఫొటో



ప్రమాదానికి కారణమైన లారీ

- విధులు ముగించుకుని వెళ్తుండగా ప్రమాదం
- మృతుడు అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం వాసి

అక్కిరెడ్డిపాలెం (విశాఖ): విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న నేవల్ డాక్‌యార్డ్ ఉద్యోగిని మృత్యువు లారీ రూపంలో కబళించింది. తమ కళ్లెదుటే ఉద్యోగి దుర్మరణం చెందడంతో తోటి ఉద్యోగులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం అరడకోటకు చెందిన ఎం.దిలీప్ కుమార్ (26) నేవల్ డాక్‌యార్డ్‌లోని టీఎంఎం విభాగంలో పనిచేస్తున్నాడు. షీలానగర్‌లో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం విధులు ముగించుకుని స్కూటీపై ఇంటికి బయలు దేరాడు. డాక్ యార్డు నుంచి షీలానగర్ టోల్ గేటు వైపు వస్తుండగా వెనుక నుంచి వస్తున్న లారీ ఆతని వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో దిలీప్ కుమార్ అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్రంగా గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. దిలీప్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అతనికి ఇటీవలే వివాహం అయినట్టు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

కె.కె.లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: బచేలి, కిరండూల్ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కె.కె.లైన్‌లో నడిచే రైళ్లు దంతేవాడ వరకే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్, విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ శనివారం నుంచి అక్టోబర్ 4 వరకు, కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్, కిరండూల్-విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ 29 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి. ఈ తేదీల మధ్య దంతేవాడ-కిరండూల్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు.

ప్రమాద స్థాయిలో తాండవ నీటిమట్టం

- పరిసర గ్రామాలు అప్రమత్తంగా ఉండాలి
- తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ

నాతవరం : తాండవ రిజర్వాయరు నీటి మట్టం ప్రమాద స్థాయిలో ఉందని ఏసమయంలోనైన స్పిల్‌వే గేట్లు ద్వారా నదిలోకి విడుదల చేస్తామని ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు. ఆమే శుక్రవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ తాండవ రిజర్వాయరు ప్రమాద స్థాయి నీటి మట్టం 380 అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి 377.9 అడుగులకు చేరిందని ఇన్ ఫ్లో నీరు ఎగువ ప్రాంతం నుంచి 500 క్యూసెక్కులు దాటి వస్తుందన్నారు తాండవ ప్రధాన గేట్ల ద్వారా పంట కాలువలు ద్వారా ఆయకట్టుకు 500 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఈ విధంగా చేయడం వల్ల ప్రస్తుతం ఉన్న పరిస్థితిని బట్టి పరిశీలిస్తే ఏలాంటి సమస్య లేదన్నారు. ఎగువ ప్రాంతం నుంచి ఇన్ ఫ్లో నీరు ప్రాజెక్టులోకి పెరిగితే 378 అడుగులు దాటితే స్పిల్‌వే గేట్లు ద్వారా తాండవ నదిలోకి నీటిని విడుదల చేస్తామన్నారు. రాత్రి సమయంలో తాండవ నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న గ్రామాల ప్రజలు, పశువులు నదిలోకి దిగరాదని హెచ్చరికలు జారీ చేశామన్నారు. అదే విధంగా నాతవరం, కోటనందూరు, తుని మండలాల అధికారులకు ముందస్తుగా సమాచారం ఇచ్చామన్నారు.

కలుషిత ఆహార బాధితులకు ఆర్థిక సాయం



గిరిజన కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న చింతపల్లి తహసీల్దారు రామకృష్ణ

చింతపల్లి: కోటఉరట్ల మండలం కైలాసపట్నంలోని కలుషిత ఆహారం తిన్న ఘటనలో బాధితులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించినట్టు చింతపల్లి తహసీల్దారు రామకృష్ణ తెలిపారు. లంబసింగిలో చింతపల్లి మండలానికి సంబంధించి బాధిత విద్యార్థులు 16 మందికి ఒకొక్కరికీ రూ.5వేలను సాయంగా అందించారు. వీఆర్వోలు నాగరత్నం, శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు సత్యవాణి పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు కిడ్నీ బాధిత విద్యార్థి తరలింపు



విద్యార్థి రోహిత్‌ను కేజీహెచ్‌కు తరలిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పెదబయలు: మండలంలోని కిముడుపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కిల్లో రోహిత్‌కు కిడ్నీ సమస్య తలెత్తడంతో అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ నెల 26న పాడేరు జిల్లా ఆస్పత్రికి చేర్పించగా, అక్కడ వైద్యులు పరీక్షించి కిడ్నీ సమస్య ఉందని విశాఖ కేజీహెచ్‌కు రిఫరల్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హెచ్‌ఎం గోపాల్‌రాజ్, ఉపాధ్యాయులు కేజీహెచ్‌లో చేర్పించారు. ఐటీడీఏ పీవోతోపాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని హెచ్‌ఎం తెలిపారు. విద్యార్థి ఆరోగ్యం బాగానే ఉందన్నారు. విద్యార్థి వద్ద తల్లిదండ్రులు ఉన్నారన్నారు.

కార్మికుల సమస్యలపై 30న చలో కలెక్టరేట్



కార్మికులకు కరపత్రాలు పంచుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్

చింతపల్లి: అన్ని విభాగాల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 30న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ తెలిపారు. శుక్రవారం చింతపల్లిలో పలు కార్మికులను కలసి చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పంచిపెట్టారు.

బంతిపూల దిగుబడులు ప్రారంభం



పాడేరులో బంతిపూల అమ్మకాలు



పాడేరు పాతబస్టాండ్‌లో వ్యవసాయ ఉత్పత్తులతో గిరిజన రైతులు

సాక్షి, పాడేరు: మన్యంలో పెద్ద బంతిపూల దిగుబడులు ప్రారంభమయ్యాయి. శుక్రవారం పాడేరు పాత బస్టాండ్ మార్కెట్‌కు గిరిజన రైతులు బంతిపూలను బుట్టలతో తీసుకువచ్చి అమ్మకాలు చేపట్టారు. బుట్ట పూలు రూ.100కు విక్రయించారు. లేత గుమ్మడికాయలు, పాదుల చిగుర్ల వ్యాపారం సాగింది. చిన్న గుమ్మడి పిందె రూ.20 ధర పలికింది. సీతాఫలాలు, చామదుంపలు, టమోటా, పలు ఆకుకూరలను గిరిజన రైతులు అమ్మకాలు సాగించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ AU డిస్టెన్స్ ఎడ్యుకేషన్ BA, B.Com, B.Sc, MA, M.Com, M.Sc, MBA, MCA & AP ఓపెన్ స్కూల్ ద్వారా డైరెక్ట్ 10th & Inter One Sitting. అడ్మిషన్లు జరుగుచున్నవి. పాస్ గ్యారంటీ గైడెన్స్. ఫోన్ : 85006 23868, 90590 86040 [V- 2692]

Real Estate

FLAT FOR SALE

■ Legend Group now New Apartment 3 BHK Luxury Deluxe Flats for sale at Ramnagar. Care Hospital Back side. Cont : 76608 98898 [V- 710]

■ Duplex Flats For Sale at Kurmannapalem, Pedagantyada 1850 Sft, North Facing, 4BHK, Cost: 80 Lakh. Sridevi Paradise, Ph: 90324 23069, 84659 49225. [V- 6564]

HOUSE FOR SALE

■ వేపగుంట దరి చీమలాపల్లి గ్రామం, శేషాద్రినగర్ ఏరియాలో 25x40=111 చ॥గ॥ (3) ఇల్లులు నిర్మించి ఇవ్వెదము. North Facing, 30 Feet Road. ఫోన్ : 96182 90374, 89771 84266 [V- 12625]

PLOT FOR SALE

■ విజయనగరం మహారాజా కాలేజీకి 2.5 KM దూరంలో ఉడా ప్లాట్స్, క్లబ్ హౌస్, స్విమ్మింగ్‌పూల్ సౌకర్యాలతో అమ్మకం. స్పాట్ రిజిస్ట్రేషన్, బ్యాంక్ లోన్ కలదు. ఫోన్ : 97012 82125, 93968 39858 [V- 1850]

■ 350 Yards VUDA Approved Plot for Sale at Simhapuri Colony, Simhachalam. Contact : 90597 02329 [V- 823865]

www.sakshi.com

LEASE / RENT

■ Build to Suit 7000 Sft / 15,000 Sft. Commercial building for Retail use at Vinayaknagar, GVMC Pump House, Gajuwaka. Cont : 96422 78795 [V- 786936]

Services

ASTROLOGY

■ శ్రీ సాయిదుర్గ జ్యోతిష్యాలయం, 9 సం॥లుగా స్థిరంగా ఉన్నారు. స్త్రీ/పు॥ ప్రేమ పెళ్ళి, వ్యాపారం, గ్రహదోష, వశీకరణ, ఎటువంటి సమస్యలైనా 21 రోజులలో పరిష్కారం. SR మాల్ ప్రక్కన, కొత్త గాజువాక సంప్ర॥ 7702201190. [W-1239999]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12484]

OLD AGE HOME

■ Elder Home గాజువాక & అక్కయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన వున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం॥ వైద్యసేవలు. హోమ్‌కేర్ సర్వీస్ కలదు. ఫోన్ : 87904 49799, 90103 92178 [V- 823866]

SEPTIC TANK CLEAN

■ లక్కీ సెప్టిక్ ట్యాంక్ అతి తక్కువ ఖర్చుతో క్లీన్ చేయబడును. ఎలాంటి దుర్వాసన లేకుండా హైటెక్ మిషన్‌తో క్లీన్ చేయబడును. ఫోన్ : 94907 02911, 95501 39966, 90300 25193, 90300 25192. [V-791087]

Wanted

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1185457]

■ Required Technicians - 2 Nos & Delivery Boy - 1 for IFB Servicing Center. Location : MVP Colony. Freshers also apply. Cont : 89787 81528, 80081 19307 [V- 823834]

■ Govt. Reg. సంస్థ నందు Part Time / Full Time జాబ్ చేయుటకు యువతి / యువకులు కావలెను మరియు Tele Callers, Receptionists కావలెను. ఫోన్ : 82973 69677, 94933 56534 [V- 6563]

■ Maniraj Electro Mobikes - Multi Electric Vehicle Show Roomలో పని చేయుటకు మెకానిక్/సేల్స్ ఎగ్జిక్యూటీవ్స్ కావలెను. సంప్ర॥ ✆7997226984, 7997638005. [O-190043]

■ RK ఇంజనీరింగ్ కాలేజి బాయ్స్ హాస్టల్ నందు పనిచేయుటకు వార్డెన్స్, వంట మాస్టర్స్ మరియు ఎలక్ట్రీషియన్స్ కావలెను. మంచి జీతం +భోజనం+ఉచిత వసతి కల్పించబడును. సంప్ర ॥ కేతనకొండ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం విజయవాడ. సెల్ : 9701473399 [G-209]

■ మా వైజాగ్ బ్రాంచ్ నందు పనిచేయుటకు 1) సూపర్ వైజర్లు, 2) వర్కర్లు కావలెను. పూర్తి ధరఖాస్తుతో సంప్రదించండి. ఇండియన్ పెస్ట్ కంట్రోల్, ఫస్ట్‌ఫ్లోర్, భారత్ పెట్రోల్ బంక్ ఎదుట, ఆటోమోటివ్ ఎదురుగా, మద్దెలపాలెం, వైజాగ్ ✆ 83670 33999 [B-493]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీ: 18k. ఫోన్ 9640258899, 9640468899 [H-796281]

■ హైదరాబాద్‌లో ప్రముఖ యూనివర్శిటీలో 200 మంది (Ex-Army) సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. (జీతం:8Hrs. 19,500/- & 12 Hrs. 28,200/-, 4సెలవులు + ఉచిత వసతి).ఫోన్: 9959433789 [H-804876]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	:9010546644
యలమంచిలి	:9951602901
చోడవరం	:9010210265
నర్సీపట్నం	:9010234557
పాడేరు	:9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా నాలుగు లైన్లు రూ.475/- అదనపు లైను రూ.100/- + 5% జి.ఎస్.టి. అదనం